# తాతయ్యగారి ఇల్లు

**మ**హాలక్ష్మి నెత్తిన పిడుగుపడినట్లు అయింది.

అదేం పాపకర్మమో ఆవిడ పుట్టి బుద్ధి తెలిశాక అనేకమార్లు పడింది నెత్తిన పిడుగు. ఏదో ఆవిడ ప్రసక్తి వచ్చింది కాబట్టి అలా అనుకోవాల్సింది కానీ ఆ విధంగా జీవితంలో ఎన్నో సందర్భాల్లో ఎదురు దెబ్బలు తినడం సామాన్య ప్రజానీకానికి అలవాటే.

మనదేశంలో మామూలు మనిషికి వ్యవహారం సజావుగా సాగితే ఆశ్చర్యపడాలి గానీ బెడిసికొడితే మామూలే. మహాలక్ష్మికి భర్త వున్నాడు. ఆయన పేరు సుబ్బారావు. మంచివాడు. చిన్న ఉద్యోగంచేసి రిటైర్ అయ్యాడు. ఆ మంచితనమే తప్పించి వ్యసనాలేం లేవు.

పెళ్ళయిన తరువాత మొదటి రాత్రి భార్యతో నువ్వు చందమామలా వున్నావు, జాబిల్లిలా వున్నావు వంటి రొమాంటిక్ డైలాగులేం చెప్పలేదు.

"నా జీవితం రెండొందల యాభై. కటింగులు పోను రెండొందలపైన చేతికొస్తుంది. నాకేం అలవాట్లు లేవు. మా ఆఫీసు దగ్గర కాకా హోటల్లో తింటాను. ఒక్కసారి పాన్ వేసుకుంటాను.

"నేనేం మేధావిని కాను. పరిగెట్టి పాలుతాగడం నాకు రాదు. నిలబడి నీళ్ళు తాగుతాను" అంటూ మామూలు వివరాలే చెప్పాడు.

భార్య కాపురానికి వచ్చాక మొదటి తారీఖున జీతం రాగానే భార్య చేతికిచ్చాడు. "ఇదుగో ఇదీ నా సంపాదన. ఏం చేసుకుంటావో నీ ఇష్టం" అని చేతులు దులిపేసు కున్నాడు.

అప్పటికి ఆవిడ వయసు ఇరవైలోపే. జీవితం నేర్పిన పాఠాలు ఏ డిగ్రీలూ నేర్పవు. కాబట్టి ఆవిడ చాలా పాఠాలు నేర్చుకుంది. మొదట్లో నా భర్తకి నేనంటే చాలా ప్రేమ. అందుకే పెత్తనం అంతా నాకు ఇచ్చాడు అని ఆనందపడింది.

అదంతా ప్రేమకాదనీ అన్నీ అవతలి వారిమీద పడేసి సుఖంగా తిరగడమనీ తెలిసివచ్చేసరికి కాలాతీతం అయిపోయింది. దాంతో తెలివిగలది అని కొంతమందిచేత, గడుసు పిండం అని మరికొందరిచేత అనిపించుకుంటూ సంసారం లాక్కొస్తోంది మహాలక్ష్మి.

“నిష్పూచ నిరాచింత” అంటూ కాలం గడిపేస్తున్నాడు. ఆయన్నంతా మహాలక్ష్మి గారి మొగుడనే అంటారు.

జీవితంలో చాలా ఢక్కా మొక్కీలు తిన్నది మహాలక్ష్మమ్మ. పెద్దల అనారోగ్యాలు, అత్తింటివైపు బాధ్యతలు అన్నీ ఏదో విధంగా జరుపుకొచ్చింది.

కూతురు, కొడుకు, కూతురికి పెళ్ళీడు వస్తోందని కాస్త డబ్బు వెనకేసింది. కొంచెం బంగారం కూడా కొన్నది. తీరా చూస్తే పదహారేళ్ళ ఆ పిల్ల కాస్తా వున్నట్టుండీ రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోయింది.

“ఏడవకు! ఏం చేస్తాం? దాని ఆయుర్దాయం తీరిపోయింది. ఇంకా నయం పెళ్ళై పిల్లలు పుట్టాక పోయివుంటే ఆ పిల్లలని చూసుకుని జీవితాంతం కడుపుకోత అనుభవించేవాళ్ళం” అని ఓదార్చాడు సుబ్బారావు.

కొడుకు ఎలక్ట్రికల్ పనులన్నీ నేర్చుకున్నాడు. చాలా మంచి పేరు సంపాదించుకున్నాడు. బాగానే సంపాదిస్తున్నాడు. కోడలొస్తే కూతురులేని లోటు కొంతైనా తీరుతుందని పెళ్ళిచేశారు. ఆ అమ్మాయి పేరు సుమతి. పేరుకి తగ్గట్టు బుద్ధిమంతురాలు.

జీవితం బాగానే సాగిపోతోంది. సుబ్బారావు రిటైర్ అయ్యాడు. ఆ సమయంలోనే తెలిసినవాళ్ళ ద్వారా ఒక ఇల్లు అమ్మకానికి వచ్చింది. మూడొందల గజాల స్థలంలో చిన్న పెంకుటిల్లు. మధ్య హాలూ ముందు వరండా వెనక చిన్న వంటగది., సిటీనించి గంటన్నర ప్రయాణం. చేతుల్లో వున్నదంతా పెట్టి ఇల్లు కొన్నారు. ఖాళీస్థలంలో కూరల మొక్కలు వేసుకున్నారు.

ప్రస్తుతం వేసవికాలం పెద్దవాళ్ళు వరండాలో, చిన్నవాళ్ళు హాల్లో సౌకర్యంగా పడుకుంటున్నారు.

చలికాలం వచ్చేనాటికి ఏ లోనో తీసుకుని ఓ మూల చిన్నగది వేయించుకుందాం అనుకున్నారు. చలికాలం రాకముందే మరో మార్పు వచ్చింది. కొడుకు సునీల్‌కి గల్ఫ్ వెళ్ళే అవకాశం వచ్చింది. ఏజెంటు ద్వారా అతని తోటివాళ్ళు దాదాపు ఇరవైమంది వెళ్తున్నారు.

తల్లిని సలహా అడిగాడు సునీల్.

"కొత్తగా పెళ్ళి అయినవాడివి, నువ్విప్పుడు వెళ్లడం మంచిదంటావా? ఆలోచించుకో" అంది మహాలక్ష్మి.

"ఇంకా కొంతకాలమైతే పిల్లా పీచూ కలుగుతారు. అప్పుడు వెళ్ళడం కుదరదు. అదీగాక మనం వెళ్ళాలనుకున్నప్పుడు అవకాశం రావద్దా?" కాకపోతే సుమతి బాధ్యత మీమీద పడుతుంది నే వెళ్తే" అన్నాడు.

"అదేం మాటరా అది మాకు పరాయిదా! నా కూతురిలా చూసుకుంటాను" అంది మహాలక్ష్మి. ఏజెంటుకి కట్టడానికి కావలసిన సొమ్ముకి కొంత మహాలక్ష్మి సర్దుబాటు చేసింది. మరికొంత సుమతి తన పినతండ్రి దగ్గర వడ్డీకి తీసుకుంది. సునీల్ విమానం ఎక్కాడు.

హమ్మయ్య ఇకపైన పైసకీ వెతుక్కోనవసరం లేదు. వాడు పంపించే డబ్బుతో ముందు అప్పుతీర్చి ఇక ఆ తరువాత సుఖంగా బతకొచ్చు. నాలుగురాళ్ళు వెనకేసుకుంటే రేపు వాడిపిల్లల భవిష్యత్తు బావుంటుందనుకుంది మహాలక్ష్మి. అంతలోనే పిడుగులాంటి వార్త.

ఆ ఏజెంటు మోసం చేశాడు. ఆర్నెల్లలోగా సునీల్ ఇండియాకి తిరిగి వచ్చేయాలి. లేకపోతే అక్కడి గవర్నమెంట్ శిక్ష తీవ్రంగా వుంటుంది. ఈ ఆర్నెల్లు కూడా వీళ్ళు సంపాదించే దాంట్లో మూడొంతులు వాళ్ళే తీసుకుంటారు. మిగిలింది వీళ్ళ తిండికి చాలదు. గొడ్లకొష్టంలాంటి గదిలో పశువులా పడివున్నాడు సునీల్.

"చూడు నాన్నా, అక్కడి పరిస్థితి ఏమిటో ఇక్కడున్న నాకు తెలియదు. వీలైనంత త్వరలో ఆ చెరనుండి బయటపడే మార్గం చూడు. ఏదోలా మనదేశం చేరుకో. ఆ తరువాత ఏం చెయ్యాలో చూద్దాం. అధైర్యపడకు, ధైర్యంగా వుండు" అని చెప్పింది మహాలక్ష్మమ్మ.

సుమతి కంటికీ మింటికీ ఏకధారగా ఏడుపు. తిండీ నీళ్ళూ మానేసి, మతిపోయినదానిలాగా ముక్కోటి దేవతలకూ మొక్కుకుంటూ జీవచ్ఛవంలా తయారైంది.

'మోసపోయాడేగాని కేసుల్లో ఇరుక్కోలేదుగా. అదే పదివేలు" అన్నాడు సుబ్బారావు.

మహాలక్ష్మమ్మకు మళ్ళీ ఎదురుదెబ్బ తగిలింది.

కొడుకు తిరిగొస్తాడు. అది ఆనందమే.

చేతిలో పనుంది కాబట్టి వాడి కడుపుకింత సంపాదించుకోగలడు. పెళ్ళానికింత పెట్టగలడు.

కానీ తర్వాత సంగతి? చేసిన అప్పులెలా తీర్చాలి? ఇల్లమ్మి నిలవ నీడ పోగొట్టుకుని రోడ్డునపడితే ఈ పెద్ద వయసుకి జీవితం ఎలా వెళ్ళమారాలి?

ఏదో మార్గం వెతకాలి. సమస్యను వెన్నంటి పరిష్కారం కూడా వుంటుంది. పరిస్థితులు తారుమారు అయినప్పుడు డీలా పడిపోకుండా ధైర్యంగా ఆలోచిస్తే ఏదో తోవ దొరకకపోదు.

అహోరాత్రాలూ అదే ఆలోచన మహాలక్ష్మికి.

చివరికి ఒక ఉపాయం తట్టింది. తన పథకం నెరవేరుతుందా అని సందేహించింది.

కాలం ఎల్లకాలం ఒకే రకంగా వుండదు. ఒకసారి కాటేసినా మరొకసారి కరుణించక మానదు. ధైర్యంగా పోరాడడమే మనిషి కర్తవ్యం. భగవంతుడిమీద భారంవేసి ప్రయత్నం మొదలు పెట్టింది. ఏమీ పట్టని భర్తకు, సర్వం పోగొట్టుకున్న దానిలా ఏడుస్తున్న కోడలికీ పరిస్థితి వివరించి వాళ్ళని కర్తవ్యోన్ముఖులను చేసింది.

మెడలోని పుస్తెలగొలుసు బ్యాంకులో పెట్టి లోన్ తీసుకుంది. ఇరవై వేలు వచ్చింది. ఇంటికి తెల్లసున్నం వేయించింది. మూలపడిన నవ్వారు మంచాలు బిగించి నవారల్లించింది. పరుపులూ, దిళ్ళూ ఏకించి కుట్టించింది. నేత దుప్పట్లు కొంది. మోకు కొని దొడ్లోని చింతచెట్టుకి ఉయ్యాల కట్టించింది.

ఇంటివెనక వున్న స్నానాల గదీ, సెప్టిక్ లెట్రిన్ శుభ్రం చేయించింది. కొడుకు వున్నప్పుడు వాడి మూలపడేసిన సెల్‌ఫోన్‌కి కార్డు వేయించింది. మంచిరోజు చూసి పేపర్లో ప్రకటన ఇచ్చింది.

"తాతయ్యగారి ఇల్లు"

"పట్నంలో సిమెంట్ గూళ్ళలో మగ్గిపోతూ, పల్లెకు వెళ్ళి తాతగారింట్లో గడపడం అంటే ఏమిటో ఎరగని పిల్లలకు సువర్ణావకాశం. వివరాలకు సంప్రదించండి" అని

సెల్ నెంబర్ ఇచ్చింది. శాకాహారం మాత్రమే కుటుంబాలకు మాత్రమే అని ఖచ్చితంగా రాసింది.

చాలామంది ఫోన్లు చేశారు. అసలేమిటి విషయం అని అడిగారు. ఏముంది నాయనా! కాలం మారింది. అందరూ పట్నానికి చేరడంతో పిల్లలకు పల్లెటూరు వెళ్ళి తాతయ్య గారింట్లో ఏ పండుగ సెలవులకైనా గడపడం గగనం అయిపోంది. అందుకే ఈ ఏర్పాటు. శనాదివారాలు ఇక్కడికి వస్తే పల్లెటూరి వాతావరణంలో గడిపివెళ్ళచ్చు" అని చెప్పింది.

"మరి అక్కడ అన్ని ఏర్పాట్లు ఘనంగా వుంటాయా?" అని అడిగితే –

పల్లెటూర్లలో ఘనమైన ఏర్పాట్లు ఎలా వుంటాయి? సౌకర్యంగా మాత్రం వుంటుంది అని చెప్పింది.

"ఎంత ఛార్జ్?" అని అడిగితే

"పదిహేను వందలు. రెండు రోజులూ భార్య, భర్త ఇద్దరు పిల్లలకి. భోజనం, వసతి. మీరు సిటీలో మంచి హోటల్‌కి వెళ్తే ఒక పూట భోజనానికి అయినంత.

ఒకసారి వచ్చి చూడండి. మీకు తప్పకుండా ఇక్కడి వాతావరణం నచ్చుతుంది అని చెప్పింది.

పాతికమంది ఫోన్లు చేశారు. ఒకరు సరే అన్నారు.

విలువైన వస్తువులు ఏమీ మీతోపాటు తెచ్చుకోవద్దని చెప్పింది. ఇల్లు గుర్తులు చెప్పింది.

శనివారం పొద్దున తొమ్మిదింటికి మారుతీకార్లో వచ్చారు శ్రీధర్, జ్యోతి, పిల్లలు శ్రుతి, కీర్తన.

ఊరికి చివరగా చుట్టూ ఖాళీ స్థలం. అందులో చింత, వేప, మామిడి, పనస, జామ, కొబ్బరిచెట్టు. ఇంటిమీదికి పాకిన సొర, గుమ్మడి తీగలు.

ఇంటిముందు అద్దంలా అలికి ముగ్గులు పెట్టి వున్న ఆ ఇల్లు కొండపల్లి బొమ్మలా వుంది.

"రండమ్మా! రండి బాబూ! ప్రయాణం బాగా జరిగిందా? కాళ్ళు కడుక్కోండి" అని పలకరించి గుమ్మం దగ్గర పెట్టిన సిమెంటు తొట్లోనించి తెల్లగా తోమిన ఇత్తడి చెంబుతో నీళ్ళు అందించింది.

"ఎందుకు డాడీ కాళ్ళు కడుక్కోవడం" వింతగా చూస్తూ అడిగింది పదేళ్ళ కీర్తన.

"ఇది మన ఆచారం పాపా! పాతరోజుల్లో నడిచి వచ్చేవాళ్ళు కదా! అందుకే ఇలా గుమ్మందగ్గర కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చేవారు" చెప్పాడు శ్రీధర్.

తల్లీ పిల్లలూ వద్దన్నారుగానీ శ్రీధర్ మాత్రం బూట్లు విప్పి కాళ్ళు కడుక్కున్నాడు. సుమతి కార్లోనించి సామాన్లు దించి ఇంటిలోపల పెట్టింది.

వరండాలో నవారుమంచం వాల్చి కూర్చోబెట్టి మంచినీళ్ళు ఇచ్చారు. వరండాలోనే ఒక పక్క కుంపటిమీద పెనం పెట్టి మినపట్లు వేసి అల్లంపచ్చడి వేసి అందించింది. ఒకటి తిని "ఇంకోటి వేస్తారా! బ్రేక్‌ఫాస్ట్ లిమిటెడా?" అని మహాలక్ష్మిని అడిగింది జ్యోతి.

"అదేమిటమ్మా? ఇది హోటలు కాదు ఇల్లు. కావలసినన్ని తినండి" అని వడ్డించింది మహాలక్ష్మి.

కడుపునిండా తిన్నారు దంపతులు. పిల్లలు మాత్రం ఈ టిఫిన్ దగ్గరకు ఓ పట్టాన రాలేదు.

చెట్టుకి కట్టిన ఉయ్యాల ఊగుతూ రాము పొమ్మన్నారు. టిఫిన్ తిని మీ ఇష్టం వచ్చినంతసేపు ఆడుకోండి అని బతిమాలి తీసుకొచ్చారు తల్లిదండ్రులు.

కాఫీలిచ్చాక, చెట్లకింద మంచాలు వాల్చి కాసేపు విశ్రాంతి తీసుకోండి అన్నాడు సుబ్బారావు. తెల్లవారురఝామునే లేచారేమో కడుపునిండా తిండి పడేసరికి నిద్రముంచుకొచ్చింది శ్రీధర్-జ్యోతిలకి.

పిల్లలు సుమతి దగ్గర చేరువయ్యారు. హాలీడే ఆంటీ అంటే మహాలక్ష్మి నవ్వింది. "మామ్మా తాతయ్యా అని పిలవండమ్మా. సుమతిని అత్తా అనండి" అని చెప్పింది. కాస్సేపటికి బాగా దగ్గర అయ్యారు.

వాళ్ళకి అన్నీ విచిత్రమే. నేలమీద పాతిన రోట్లో పచ్చడి నూరుతుంటే వింతగా చూశారు.

ఇత్తడి గిన్నెతో అన్నం వారుస్తుంటే అదేదో సర్కస్ ఫీట్ చూసినంత సంబరపడిపోయారు.

వంట అయ్యాక శ్రీధర్‌ని లేపాడు సుబ్బారావు.

అబ్బ ఎంతసేపు నిద్రపోయాను... అనుకుంటూ లేచాడు శ్రీధర్. భార్యని లేపాడు. ఇంత నిశ్చింతగా నిద్రపోయి చాలాకాలం అయింది అంది జ్యోతి.

వంట చల్లారిపోతుందని లేపేశాం. భోజనం చేసి మళ్ళీ పడుకోండి... అంది మహాలక్ష్మి.

డైనింగ్ టేబుల్ లేదు. కింద కూర్చోగలరా లేకపోతే చిన్న బల్ల, కుర్చీ వేస్తాం అని అడిగితే "వద్దండీ కింద కూర్చుంటాం" అన్నాడు శ్రీధర్

"పిల్లలకి కంచంలో పెట్టండి. బఫేలా తినేస్తారు. వాళ్ళకి కింద కూర్చోవడం రాదు" అంది జ్యోతి.

కింద చిన్న చాపలు పరిచి కుట్టుడాకుల్లో వడ్డనచేసింది మహాలక్ష్మి. చిక్కుడుకాయ కూర, ముద్దపప్పు ధప్పళం, వంకాయ పచ్చడి, కాస్త ముతగ్గా వున్న బియ్యం అన్నం, అప్పడం, ఆవకాయ, చెయ్యి తిరిగిన ఆ పెద్దావిడ చేతివంట ముందు ఆర్భాటంగా వందరకాలు వడ్డించిన బఫేలు బలాదూర్.

ఆ నాపరాళ్ళ నేలమీద కూర్చుని భోజనం చేస్తుంటే ఏనాడో చిన్నతనంలో అమ్మమ్మగారింట్లో తిన్న భోజనం గుర్తొచ్చి మనసు పులకించిపోయింది శ్రీధర్‌కి.

అతి తక్కువ నూనెతో ఎంత రుచిగా వండింది ఈవిడ! ఈ టెక్నిక్ నేర్చుకోవాలి అనుకుంది జ్యోతి.

పిల్లలు సరేసరి. కంచాలు పుచ్చుకుని చెట్లకింద ఆడుకుంటూ రోజూకంటే ఓ ముద్ద ఎక్కువే తిన్నారు.

మరి కాసేపటికి వాతావరణం మారిపోయింది. అతిథులెవరో ఇంటివారెవరో తెలియనంతగా కలిసిపోయారు. బోరింగ్ దగ్గర నీళ్లు కొట్టడం ఒకరికి సరదా! దొడ్లో మూల వున్న నీళ్ళపొయ్యి కింద మంట ఎగదోసి కాగులోంచి నీళ్ళు తోడుకోవడం మరొకరికి సరదా!

రాత్రి భోజనాలు ఆరుబయట.

అదృష్టవశాత్తు కరెంటు కూడా పోయింది.

పలుచటి వెన్నెల. రాత్రి పొద్దుపోయేదాకా హాయిగా కబుర్లు చెప్పుకున్నారు. పిల్లలు తాతగారి దగ్గర కథలు చెప్పించుకున్నారు.

తెల్లవారింది. సుమతి కళ్లాపు చల్లితే ముగ్గు నేను వేస్తా అంది జ్యోతి. ఆవిడ వేసిన ముగ్గుచూసి పడీ పడీ నవ్వాడు శ్రీధర్. ఉడుక్కుంది జ్యోతి.

తర్వాత కాసేపటికే ఇంటిమీదికి పాకిన సొరపాదుకివున్న సొరకాయ కొయ్యడానికి సరదాపడి చెమటలు కక్కుకున్న శ్రీధర్‌ని చూసి నవ్వేసి ఏడిపించి బదులు తీర్చుకుని తృప్తిపడింది జ్యోతి.

పిల్లలు తోటకూర కోశారు సంబరాలు పడుతూ. టమోటా పచ్చడి నేను నూరతాను రోట్లో అని సుమతి చేతుల్లోంచి లాక్కుంది జ్యోతి.

ఆ పూట మామూలు వంటతో కాస్త పులిహోర కూడా కలిపింది మహాలక్ష్మి. రెండు రోజులు క్షణాల్లా గడిచిపోయాయి. సోమవారం తెల్లవారు ఝామునే లేచి కాఫీలు తాగి వచ్చిన కారులోనే బయలుదేరారు.

జ్యోతికి బొట్టుపెట్టి తాంబూలమిచ్చింది మహాలక్ష్మి. పదిహేను వందలు లెక్కబెట్టి చిరునవ్వుతో సుబ్బారావు చేతికిచ్చి కారెక్కాడు శ్రీధర్.

వారి కారు కదిలాక ఆ డబ్బు భార్య చేతికిచ్చాడు సుబ్బారావు. కళ్ళకి అద్దుకుంది మహాలక్ష్మి.

"భగవంతుడా మాకువున్న పరిధి మాత్రమే పెట్టుబడిగా ప్రారంభించిన ఈ పని పదికాలాలపాటు సాగేలా చూడు. అప్పులు తీరిపోయి ఒకరి చేతిని ఆశించకుండా మా బతుకులు వెళ్ళమారిపోయేలా ఆశీర్వదించు తండ్రీ" అని మనసులో నమస్కారం చేసుకుంది.

"ఎంత హాయిగా గడిచాయి జ్యోతీ ఈ రెండు రోజులూ! మనసుకీ శరీరానికీ కూడా విశ్రాంతి దొరికింది కదా!" అన్నాడు జ్యోతితో శ్రీధర్.

"నిజమే. వీకెండ్స్‌కి ఆ షాపింగ్ మాల్స్‌కి వెళ్ళి కావలసినవీ అక్కర్లేనివీ కొని, ఆ జంక్‌ఫుడ్ తిని తగలేసే డబ్బుతో పోల్చుకుంటే ఇక్కడ ఖర్చు తక్కువ. సుఖం ఎక్కువ. నెలకొకసారైనా ఇక్కడికి వద్దాం. మన వాళ్ళకీ ఈ సంగతి చెప్పాలి అంది జ్యోతి.

కాలం మారుతోంది. మళ్ళీ పాతరోజులవైపు మొగ్గుచూపుతున్నారు జనం. పట్నాలలోని రద్దీనుండి విశ్రాంతి కావాలని కోరుకుంటున్నారు. అందుకే ప్రస్తుతం ఆరుబయట మంచంవేసి లాంతరు తగిలించే పల్లెటూరి వాతావరణం అంటే అటుకేసి మొగ్గుచూపుతున్నారు.

మూస పద్ధతికి భిన్నంగా కొత్త మార్గాన్ని కనిపెట్టిన వ్యక్తికి విజయం తథ్యం. పాతకాలం పిండివంటలు చేసుకోలేని సుకుమారులకోసం మొదలు పెట్టిన స్వగృహ ఫుడ్స్ కోట్లమీద వ్యాపారం చేస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

ఆఫీసులో అలిసిపోయి ఇంటికొచ్చిన ఇల్లాళ్ళ వెసులుబాటుకోసం వెలిసిన కర్రీపాయింట్స్ వ్యాపారాలతో కళకళలాడుతున్నాయి.

స్వంత ఊరంటూ లేనివారి పాలిట ఈ ఇల్లాలు మహాలక్ష్మి మనసులో వచ్చిన ఆలోచన ఈ "తాతయ్య గారి ఇల్లు" పథకం కూడా మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. అంతేకాదు. మరికొంతమందికి మార్గదర్శకం అయ్యింది. నగరం చుట్టుపక్కల చాలా "తాతయ్యగారి ఇళ్ళు" వెలిశాయి.

ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. కాసింత శ్రమతో కాలక్షేపం అయిపోతోంది. నాలుగు డబ్బులు కళ్ళచూస్తున్నాం. ఎవరు కనిపెట్టారో ఈ బిజినెస్.

ఆ వ్యక్తికి వెయ్యి నమస్కారాలు తెలియజేసుకుంటున్నాం అనుకొంటున్నారు వారందరూ.

*స్వాతి మాసపత్రిక మార్చి 2009*